# పెళ్ళి

తాతయ్య పేరే తనకూ పెట్టారు. ఆయన రమణయ్యగా చెలామణీ అయితే, యితను రమణమూర్తి అయ్యాడు. ఆయనలా బుగ్గ మీసాలు, తట్టలాంటి తలపాగా, పాటిసూలుపంచా, లాంగు కోటూ ఇతనికి లేవు, కానీ ఇతనికి వాటిమీద భక్తి లేకపోలేదు. ఇంతకీ తాతయ్య అంటే అతనికి జాలివేస్తుంది. ఎంత మనస్థయిర్యం లేని మనిషిని: తన్ను విన్నదేమంటే ఒకనాడు తాతయ్య మాంచి యౌవనంలో వున్నప్పుడు తన తోటలోనికి పాలేరు కూతురు గడ్డి కోసు

కోడానికి వచ్చిందట. దాని ఒళ్ళు వంపులు చూసి సమ్మోహితుడై, రంభలాంటి భార్య ఉండగా, దానికిదాసోహమని ఒక యిల్లు కట్టించి మరీ, అందులో వుంచాడట. తాతయ్యకూ ఆమెకూ కలిగిన పిల్లల పిల్లలను చూస్తున్నాడంటే ఇందులో అబద్ధం ఏమీలేదు. తను ఆ పేరు గల వాడైనా అంత హేయానికి ఒడిగట్టడం సర్వకల్ల అనుకున్నాడు మూర్తి.

చచ్చిన తాతయ్య ఒకే కొడుక్కి ఒక చక్రవర్తికి పెళ్ళి చేసినట్లు చేశాడట. ఏడు రోజుల పెళ్ళిలో యేడు గ్రామాల ప్రజలకు సంతర్పణ చేశాడు. ఏడుభోగం మేళాలు యేడు పట్టణాలనుండీ తెప్పించాడట పెళ్ళికొచ్చిన వాళ్ళందరికీ బట్టలు పంచిపెట్టాడట. ఆస్థిలో నాలుగోవంతు వూడిపోయినా ఈ రోజుకీ ఆచుట్టు పట్ల పల్లెల్లో ఆ పెళ్ళి గురించే చెప్పుకుంటారు. ఇంత పటాటోటంగా పెళ్ళి జరిగినా ఇందరి ఆశీర్వచనాలు పొందిన జంట జీవిత కాలమంతా తగవులతోనే గడిపారు.

తండ్రి పోయేసరికి మూర్తి పదిహేనేళ్ళవాడు. అంతా తన నెత్తి మీదే పడింది. తన ఇంజనీరింగు చదువయి ఉద్యోగం చూసుకొని తన పెళ్ళి తనే నిర్ధారించుకోవలసి వచ్చింది. అతని తాతయ్య తండ్రి పెళ్ళిళ్ళలో చేసిన పనులు తను సమర్థించలేక పోయాడు. పెళ్ళి అనేది ఒక పవిత్ర బంధం. ఆ బంధం పడే ముహూర్తంలో యెంతో నిశ్శబ్దత ఉండాలి. హృదయంనుంచిపుబికే [illegible]కిలా ఆక్షణంలో ఆపెళ్ళి తాలూకు పవిత్రత ఆవరించాలి. అట్టహాసమైనదేదీ అతను సహించలేడు. అన్ని హంగులున్నా ముదురు రంగుచీర కట్టినందుకు ఒక అమ్మాయి నచ్చలేదు.

ఒక యింటికి పెళ్ళిచూపులకు వెళ్ళి ఆ యింట్లో చవకబారు డిటెక్టివ్ నవలలు చూసి తిరిగి వచ్చేశాడు. తన పెళ్ళి తనకు తప్పించి మిగతావారికి ఒక సమస్య అయిపోయింది. వీడికి నచ్చిన పెళ్ళాం యెక్కడా దొరకదన్నారు కొందరు.

కానీ ఒకరోజున విధిలేక దూరపు బంధువులింట్లో పెళ్ళి, అమ్మ బదులు తనే వెళ్ళవలసి వచ్చింది. ఆ పెళ్ళిలో ఒక అమ్మాయిని చూశాడు. ఎందుకో ఆమెవేపు, ఆ అమ్మాయి తనవేపు చూడకపోయినా మరీమరీ చూడబుద్ధి పుట్టింది. చిన్న ఒంటి తెల్ల రాడితో ముక్కుపుడక వుంది. వాలు జడకు జడ గంటలు వేసుకుంది ముఖానికి పౌడరులేదు. ముఖం స్వాభావిక మైన అందంతో కాసింత సిగ్గును కలుపుకొని వుంది. ఆ కట్టిన ఆకాశరంగు చీరతో ఒక ఉషా కన్యను చూసినట్లయింది తనకి. చదువుకున్నా యీమె రంగు ఏ దేశంలో పుట్టిందో ఆసంస్కృతినుంచే తన ఆహారం పిల్చుకొని చక్కగా నమ్రతతో మెసలుతోంది. లాలిత్యంతోపాటు హుందా, మర్యాదఆమెలో గోచరించాయి. చలాకీ తనం కన్నా కొద్దిపాటి విచారం ఆ ముఖంలో కనిపించగానే యీ పిల్ల తప్పక తన భార్య అవుతుందని నిర్ధారించుకున్నాడు.

కట్నం కానుకలు లేకుండా ఒక ఇంజనీరు అల్లుడుగా వస్తుంటే ఎవరు సంతోషపడరు: వేగిరం పెళ్ళిచేస్తే యింకెవరూ మనసు మార్చరని సాధారణంగా పెళ్ళి కూతురు తండ్రి తొందర పెడ్తాడు. కాని ఈ తొందర తను పడలేదు. "మీవాళ్ళంతా మా పల్లెటూరు వచ్చి మా మంచీ చెడ్డా చూసుకున్నాక అప్పుడు సంబంధం స్థిరం

చేసుకుందాం" అన్నాడు. ఈ మాటలూ, ఈ పెద్దమనిషితరహా తనికెంతో నచ్చింది. పెళ్ళి స్థిరమైంది. అచ్చ తెనుగులో పసుపురంగు కాగితం మీద హోదాల సంపర్కం లేకుండా శుభలేఖలు ఛాపింపించాడు. తనకు సూట్లూ, బూట్లూ కాక పాటినూలు పంచెలే కావాలన్నాడు. తన ఉద్దేశాలు, భావాలూ కలవాళ్ళు తనకు తారసిల్లకపోవటంవలన తనకుమిత్రులు లేరనే చెప్పొచ్చు. తెలిసినబహు కొద్దిమందిని తన వెంట తీసుక వెళ్ళటం తనకు ఇష్టంలేదు. పెళ్ళిల్లో యేవేవో పందికొక్కు చేష్టలు చేస్తారు. అవి తనకు నచ్చవు. అంచేత తన యీడులో తనొక్కడే పెళ్ళికి ప్రయాణమైంది.

ఆ కుగ్రామంలో తన మామగారిది ఒక్కటే పెంకుటిల్లు. మిగతావన్నీ గడ్డితో వేసినయిళ్ళే. మామగారు గ్రామకరణం. ఆ వూరు తనకెంతో నచ్చింది. ఒక చిన్న యేరు గలగల పారుతోంది. తూర్పువేపు ఒక శివాలయం. ఊరిలో మామగారి ఇంటిదగ్గరలో చిన్న బడికూడా వుంది. వీళ్ళకిచ్చిన విడిదిలో సంతృప్తిగా కూర్చున్నాడు. ఆ సంతృప్తి తనలో అట్టేసేపు లేదు. ఏ ఆట్టహాసం వుండకూడదని అనుకున్నాడో అదేవుంది యీపెళ్ళిలో: మామగారు మంచి సూటు కొన్నారని విన్నాడు. పెద్ద ఇంజనీరుకదా పెళ్ళిలో అది వేసుకోవాలని పట్టు పట్టున్నాడు. కట్నం పుచ్చుకోకపోయినా ఆ డబ్బు విలువ బంగారం కూతురుకు తగిలిస్తున్నారు. బ్యాండుమేళం పట్నంనించి వచ్చింది. ఊరంతటికీ సంతర్పణ జరగబోతోంది. ఈ వైభవానికి తల్లి సంతోషపడ్తూంటే మూర్తికి చిరాకెత్తుతోంది. ఈ అన్నిటి వలన వచ్చిన చిరాకు లౌడ్‌స్పీకరు తొలిసారిగా వాగగానే ఒక్కసారి పగిలి ప్రజ్వరిల్లింది. ఇదేమిటి పెళ్లా లేక

సంతాఅనుకున్నాడు. ఈ యెడ్వర్టైటుమెంటు అంతా దేనికి? పెళ్ళి తాలూకా పవిత్రతనంతా కాల్చేసి కప్పల దప్పుల్లా యీ గందరగోళమేమిటి? ఇంకెంత సేపో ఆలోచిస్తూ కూర్చోలేక పోయాడు. లేచి పెళ్ళిపందిర వేపు నడిచాడు.

ఆ కామిక్ రికార్డు విని సంతోషంతో గెంతుతున్న కుర్రకుంకలు అగపడ్డారు. ఆనందంతో తలలూపుతున్న పల్లెప్రజ తారసపడ్డారు. పసందుగా వుందని మురిసి వెలిగే పల్లెపడుచులూ కనపడ్డారు. తొలి సారి పాటలయంత్రాన్ని యీ వూరికి రప్పించి తమకింత ఆనందాన్ని యివ్వటానికి కారకుడైన ఆ పెళ్ళికొమరుని పై అందరి దృష్టి పడింది.

ఆ పల్లెప్రజల సమూహాన్ని చూడగానే ఆపమని వచ్చే అరుపు బలవంతాన మ్రింగేశాడు. గొంతుకలో వెలక్కాయ పడ్డట్టయింది.

ఇంతలో ఆగుంపును తోసుకుంటూ ముందుకివచ్చి నిల్చొంది ఒక యౌవని, కాస్త అలజడి జరిగినా ఆ చెదిరిన జుత్తులో ఖాతరు లేనట్లుగా నిల్చొంది. ఆ మరుక్షణంలో పాటవిని ముఖం వెలిగిపోతోంది. మబ్బుల బయటకొంచి వచ్చిన చందమామలా వుంది. ఆ శరీరం చాలా పొందిగ్గా, బిగువుగా నిదానంగా వుండి ఆమెను హుషారుగా వుంచింది. ఇరువేపులనున్న మగవాళ్ళు ఆమెతో సరసాలకు లంకించుకున్నట్లు వాళ్ళ ముఖభంగిమలు చెప్తున్నాయ్. ఆమె వీటిని చాలాచులకనగా తీసుకుంటోంది. శరీరాన్ని తాకుతున్నా, ఆమె పట్టించుకోవటంలేదు.

మూర్తి వేపు యెగాదిగా చూసింది. ఆ కళ్ళలో కళ్ళెం వున్నట్లుంది. మూర్తి అక్కడనించి వెళ్ళిపోయాడు. ఆమె అంటే అసహ్యించుకో బోయాడు. ఆమె గురించి అనుకోకుండా ఊహించుకోసాగాడు. బహుశః మదపిచ్చి వుండవచ్చు లేదా తనవారెవరూ లేకపోవచ్చు. ఆ శరీరం అలా నిగనిగలాడేటట్లు వుంచడానికి దానినే అమ్ముకుంటూ ఉండవచ్చు లేకపోతే అంతమంది మగవాళ్ళు అంత చనువు తీసుకోరు. సరే ఇలాంటి వాళ్ళ గురించి తలచుకొనడ మెందుకని వూరుకోబోయాడు. ఇంతవరకూ యిలాంటి పరిస్థితిలో తను ఇరుక్కోలేదు. ఇలాంటి జాకెట్టులేని జవ్వనిని చూడనూలేదు. ఈమెలో తన తాతయ్య చూసిన పాలేరుకూతురు అగపడింది. తాతయ్య పేరుతో వొచ్చాడుగానీ తాతయ్య బుద్ధితో యీ రమణమూర్తి పుట్టలేదు అనుకున్నాడు.

ఉదయం జరగవలసిన తంతు అంతా జరిగిపోయింది. ఆ పల్లెపడుచుతోపాటు చాలామంది యీ తంతు అంతా తిలకించారు. అలక పెళ్ళి కొడుకు అయ్యాడు. విధిలేదు. దేవాలయం దగ్గర మకాం వేశారు. తన జట్టు వాళ్ళెవరూ లేరు. ఉన్న వాళ్ళయినా తన ఊహలకు సరిపడేవాళ్ళుకారు. సాయంత్రం వరకూ దేవాలయం మండపం చివరకూర్చుని నీలి ఆకాశంవేపు, తోటలో పువ్వులూ, వాటిపై వ్రాలే తుమ్మెదలవేపు చూస్తూ దారిపోయేవాళ్ళ మాటలూ, శబ్దాలూ వింటూ కూర్చున్నాడు. ఎవడో కుర్రకుంక నందివాహనంపైనున్న గంటను వాగించాడు. అది మ్రోగి చాలాసేపు "గీ" మంటోంది. ఉదయం జరిగిన సంఘటన యింకా తన మనస్సులో అలానే "గీ" మంటోంది.

అదెవరో బాజారు మనిషి. ఆమె గురించి తనెందుకంతగా తల పాడుచేసుకోవాలి? తను కాంక్షించిన వస్తువు తన భార్యగా దొరికింది. రమణమూర్తికీ రామయ్యకు చాలా తేడావుంది అనుకున్నాడు. ముహూర్తం వేకువఝామున పడింది. అంతవరకు దేవాలయంలో వుంచడానికి ఇష్టంలేక చీకటికాగానే పెళ్ళికొడుకును బడిలోనికి తీసుకవచ్చారు. పెట్రోమాక్సు దీపం వెలుగుతోంది. తనతో కొంతసేపు నలుగురైదుగురు వున్నారు. వాళ్ళ మాటలేగాని మూర్తి కలుగజేసుకోలేదు. కొందరు విసిగి వెళ్ళిపోయారు, ఇద్దరు ఆ చాపలమీదే దొర్లుతున్నారు. పెట్రోమాక్సు దీపంఅంతరాయంగా వుంది; అంత వెలుగు తనకు పడలేదు. ఆ లైటు అవసరం పెళ్ళి ఇంటిలో వుంది. హరికెన్ లాంతరు తెప్పించి యీదీపం పంపేశాడు. కాస్త ప్రశాంతం అనిపించింది. చివరకు తనతో మిగిలిన యిద్దరిలో ఒకడు వుండీ వుడిగీ గుర్రుతీస్తున్నాడు. ఇంకొకడు ప్రశాంతంగా నిద్దరపోతున్నాడు.

రెండువేపులా బడి ద్వారాలున్నాయి. చాలా రాత్రయినా మూర్తికి నిద్దర రాలేదు. చదువుతున్న పుస్తకాన్ని ముడిచి దీపం తగ్గించాడు. బడివెనుకకు వెళ్ళాడు. శుక్లపక్షపు దశమి చంద్రుడు చిరునలుపు మేఘాలతో కప్పబడుతున్నాడు: అక్కడక్కడి చిన్న చిన్న ఒయాసిస్సుల్లా నీలాకాశం. అందులో కలువల్లా చుక్కలు తప్పించి మిగతా ఆకాశ మంతా యెడారిలాంటి తెల్లమబ్బుల్లో నిండిపోయింది. అసలు గొణుక్కుంటే ఆ మిణుకుమనే నక్షత్రాలకు వినిపించేటంత ప్రశాంతంగా వుంది. ఆవెనుక నున్న చెట్లయినా శబ్దం చెయ్యలేదు. మూర్తిని ఈ ప్రకృతి లాలించినట్లయింది. ఈ

శోభకు శరీరం పులకరించ సాగింది. ఇలాంటి ప్రశాంతతే యీ హృద్యమైన వాతావరణమే, యీ మనోల్లాసమే ఆ మూడుముడులూ పడేటప్పుడు కావాలని కోరుకున్నాడు. తన కాబోయే భార్య యెదురుగా ఒక దారంతో కట్టిన పసుపుకొమ్ముతో అగుపిస్తే యీ మనసుతో ఇలానే కట్టివాడిని అనుకున్నాడు. అరణ్య మధ్యంలో ప్రశాంతంగా జరిగిన శకుంతులా, దుష్యంతుల వివాహమే నిజంగా వివాహం అని తన ఉద్దేశం.

అతని దృష్టి బడికి పొరుగునేవున్న చిన్న పాకవేపు పోయింది. దీపపుబుడ్డి వెలుగుతోంది. ఆవెలుగులో అక్కడే కూర్చున్న ఆమెవేపు చూశాడు. అచ్చంగా ఆమె—ఉదయం కళ్లెంలాంటి చూపులను ప్రసరించిన ఆమె! అతనివేపు చూస్తోంది. మూర్తి యిటూ అటూ చూశారు. ఎవ్వరూలేరు. అతని కాళ్ళు వణికాయి. బడిలోనికి వచ్చేశాడు. గుండెలో గడగడలింకా పోలేదు. ఆమె పెరటినుంచివచ్చి గుమ్మండగ్గర వంగి చూస్తున్నట్లుంది. ఎవ్వరూలేరు.... లోకం అంతా నిద్దరపోతోంది. తనూ ఆమె తప్పించి వెలుగునిచ్చిన చందమామ కూడా దాగుండిపోయాడు. ఒక్కసారి ఆమెనుముట్టుకోవాలనిపించింది మూర్తికి. తన తాతయ్యకు తను చేసిన దూషణ జ్ఞప్తికి వచ్చింది. ఆ నునుపైన శరీరం తాకి పట్టుకుంటే యెలా వుంటుందో—మళ్ళీ తన జన్మలో యౌవనంలో యింత అవయవాల పొందికతో అజంతా శిల్పంలా వున్న వనితను తాకే అవకాశం దొరకదు. కోరిక ఆశయాలను జయించేసింది. లేచి మళ్ళీ పెరటిలోకి వెళ్ళాడు. దీపం ఆరిపోయి వుంది. కానీ ఆమె ఒంటరిగా కూర్చున్నట్లు గమనించాడు. ఆమె ఇతన్ని చూసి లేచి నిల్చొంది. ముందుకు వచ్చింది. ఆ పెరటిలో తాటాకులతో

చిన్న ఆవరణ కట్టివుంది ఆమె అక్కడ నిల్చొని తన వైపే చూస్తోంది. ఇటూ అటూ చూశాడు. ఎవ్వరూలేరు. మెల్లగా అక్కడకు వెళ్ళాడు. ఆమె కాస్త ముందుకొచ్చింది. ఆమెమీద చెయ్యి వేశాడు. ఒళ్ళంతా గగుర్పాటు జెందింది. ఆమె నడుము చుట్టూ చేతులు వుంచి ఒక్కసారిగా ఆమెను కౌగిలించుకున్నాడు.

ఆ మరుక్షణంలో భయం వేసింది. ఎవరో తనను చూస్తున్నట్లు అనిపించింది. అక్కడినుండి కదిలిపోబోతుంటే ఆమె చెయ్యి పట్టుకుంది. ఆమె చేతికి రిస్టువాచీ తగిలింది. అది కావాలన్నట్లు ఆ వాచీని పట్టుకొని విప్పబోతోంది. తనే విప్పేశాడు. ఆమె చేతిలో పడేశాడు. బడిలోనికి గబగబ వచ్చేసరికి అంతా నిద్దర పోతున్నారు మనసు కుదుట పడింది.

ఆమెను ఉదయం చూడడమేమిటి? ఆమె పొరుగునే యీ రాత్రినుండి యిలా జరగటం అంతా కలగాని— నిజమెలా అవుతుందనుకున్నాడు. ఆ అనుభూతి కొంతసేపువున్నా ఆమె వెచ్చనైన కౌగిలినించి అంత వేగిరం తప్పించుకొని యెలా రాగలిగా ననుకున్నాడు. మనసులో వుద్వేగం శాంతించక తను ఎంతపని చేశానని విసుక్కున్నాడు. తనూ రమణయ్య అయిపోయాడని ఆవేదన చెందాడు. తాతయ్య లోకం కళ్ళు కప్పలేదు. తనో లోకం కళ్ళు కప్పాడు. కాని తన కళ్ళుకప్పగలడా? ఎంతో పొరపాటు చేశానని నొచ్చుకుంటుంటే యింతలో తనకు పెళ్ళిపీటలమీదికి పిలుపుకోసం మనుషులు వస్తున్న అలజడైంది. ఎంతో నిద్దురపోతున్నట్లు నటించాడు. వచ్చిన వాళ్ళులేపగానే బరువుగా లేస్తూ "అప్పుడే టైమయిందా?" అన్నాడు. "కాలేదూ? మా వాచీలు తప్పయితే— నీది

చూడు—" అని యెవరో అంటే అలవాటుకొద్దీ చెయ్యిచూస్తూ చప్పున చేతిని దించాడు. "ఏదీ నీ వాచీ" అన్నాడొక్కడు.

"పోయింది" చప్పున సమాధానం మూర్తి నోటినుంచి వచ్చేసింది. తరవాత వచ్చే రాద్ధాంతం సంగతి తనకు స్ఫురించ లేదు.

"అయ్యో! రాత్రి నే వెళ్ళిపోయేముందు చేతిలో చూశానే."

"అయినా ఏంపూరు? దొంగవూరు. పెళ్ళికొడుకు దగ్గరే వెయ్యాలా కన్నం?" ఇంకొకడు అందుకున్నాడు.

"అంత మత్తు నిద్దరైతే యెలాబాబూ?" "పెళ్ళికొడుకుదీ—చాలా ఖరీదైన వాచీ. పోయిందట!"

ఎవరినోట చూసినా యిదేమాట—ఊరంతా ఇదేమాట కర ణంగారికి ఎన్నడూలేని పౌరుషం వచ్చేసింది. ఆ క్షణంలో వెతి కించే అవకాశంలేదు—ముహూర్తం దగ్గరౌతోంది—తన కింత అమర్యాద తెచ్చిన దొంగనిపట్టి చీల్చేస్తానని భీష్మించుకున్నాడు.

పెళ్ళి అయిపోయింది కూతురు అత్తవారింటికి ప్రయాణ మౌతోంది. అయినా వాచీ దొరకలేదు. ఈ వాచీ గురించి యింత గొడవెందుకు చేస్తారని అల్లుడు వద్దన్నకొద్దీ మామగారికి పట్టుదల హెచ్చిపోయింది. భక్షించడానికి నోరు తెరచిన పులిలా కాచుకొని వున్నాడు.

భార్య తన యింటికి వచ్చింది. తొలిసారి ఆమెను ఒంటిగా కలుసుకోవటం తన ఇంటిలో బాగా అలంకరింపబడిన గదిలో జరి గింది.

ఆమె దించిన ముఖము చేతితో మెల్లగా యెత్తాడు. ఆ వాలు కళ్ళు తన నేదో ప్రశ్నించినట్లు భ్రమపడ్డాడు. తనలో ఏదో తొట్రుపాటు, భయం పెనవేసుకున్నయ్, తను కోరుకున్న భార్యను ఎంత నిర్మల హృదయంతో ముట్టుకోవాలనుకున్నాడో అదే కాలేదు. చీకటిలో ఏదో తను ఎన్నడూ చెయ్యననుకున్నది చప్పున ఉద్రేకంలో చేసేశాడు. పరీక్షకు నిలవలేకపోయాడు. జీవితంలో నీతివంతుడుగా వుంటాననుకోవటం చాలా తెలివి తక్కువ ఆలోచన. కొందరు నీతివంతు లయ్యారంటే అలా వుండటానికి వాళ్ళ జీవితంలో పరిస్థితులు ఏర్పడతాయి. చేసిన తప్పు చెప్పుకుంటే కొంత మనసు కుదుటపడుతుంది. అత్మాభిమానం దెబ్బతిన్నా అర్థంచేసుకునే ఊహ భార్యలో ఉంటుందని, ఆమె యెదరగా దొంగలా సంచరించే పరిస్థితి పోతుందని నోరు విప్పాడు ప్రక్కనే కూర్చుని.

"చేసినతప్పు చెప్పడం మంచిది. ఒక అమ్మాయిని—అదీ ఒక పల్లెటూరి పిల్లను ఇదివరకు ముట్టుకున్నాను - ఆమెకే నా వాచీ."

ఇంకా తన నోట వివరంగా చెప్పటానికి ఈ మాటలు రాకముందే ఆమె తల చాలా క్రిందికి దించేసింది. ఆ మాటలు భార్యను చాలా బాధించాయని తెలుసుకున్నాక మరి మాట రాలేదు. తను మామూలుగా వూరుకుంటే తమ తొలినాటి రాత్రి దివ్యసీమలో విహారంలా వుండేది. మరుచటిరోజు ఉదయానికి ఆమె ముఖం యేడుపువలన వుబ్బిపోయి వుంది. మనసులు చాలా యెడంగా పోయాయి. ఇంటిలో సాయంత్రం ఆమె తల్లి ముఖం అదోలా పెట్టి యేదో గొణుక్కోవటం విన్నాడు. కుటుంబాచారం ఎటు పోతుందన్నట్లు మాటల్లో హేళన ధ్వనించింది. మూర్తి నివ్వెరపోయాడు.

వెతికి వెతికి చివరకు తన నిజాయితీని అర్థంచేసుకోలేని భార్యనా ముడిపెట్టుకున్నానని చాలా బాధపడ్డాడు. మొగుడు చేసిన తప్పి దాన్ని దాచలేని యిల్లాలుతో తనెలాకాపరం చేయగల ననుకున్నాడు. కళ్ళంట నీరు వుబికి పోయింది, మూడు రాత్రులూ మూడు యుగాల్లా గడిచిపోయాయి.

అత్తవారింటికి తనకు వెళ్ళాలని లేదు. కానీ ఆచారంప్రకారం వెళ్ళి తీరాలని అమ్మ పట్టు పట్టడంవల్లన వెళ్ళాడు. అత్తవారింటిలో అమ్మలక్కలు గుసగుసలాడుకోవటంచూసి అక్కడ నుంచి ఎవరితో చెప్పకండా పారిపోవాలనిపించింది. అతను వచ్చిన మరుచటిరోజు, ఒంటిగా తనకిచ్చిన గదిలో కూర్చున్నాడు. మనసు యెన్నో విధాలుగా పోతోంది. జీవితంలో యేది ముఖ్యమైనదో అదే తనకు కొరత అనిపించింది. మనసుకు నచ్చినభార్య-అర్ధాంగి లేదు! ఏకాకి తను-కిటికీ గుండా వీధిలోనికి చూస్తున్నాడు. గప్పునమానవ సమూహం యిటువేపే పరుగు నడకలతో వస్తున్నారు. అప్పటికి వీధి వరండాలో మామగారు యెవరితోనో లోకాభిరామాయణం వల్లిస్తున్నాడు. ఆ సమూహం మధ్య ఒక యౌవని తల దించుకుంటూ నడుస్తోంది. వీళ్ళంతా నిజానికి ఆమెను కట్టి యీడ్చుకొని వచ్చినట్లుంది.

"బాబూ! దొంగ దొరికిపోయిందని అరిచాడు వుద్రేకంగా సంతోషంతో ఒకడు.

వాచీని బాబుగారిచేతికి అందిచ్చాడు. కరణంగారు వళ్ళు పట పట లాడించాడు. పులిలా మింగటానికి వుద్రిక్తుడయ్యాడు.

చుట్టూ జనసమూహం అలానే ఆమెవేపు చూస్తుంటే ఆ వాచీతెచ్చిన పెదమనిషి:

"అమ్మ జూపింది-ఎలా గొచ్చిందే అంటే మాటాడదు."

"ఎవరిచ్చారే అని అడిగినా చెప్పదు." ఇంకొకడు అందుకున్నాడు.

"దీనికెవరు యిస్తారు. ఆబాబు నిద్దర మత్తున వుంటే ఆ పక్కనే యిల్లుకదు బాబూ_తీసుకపోయింది-ముండ!"

ఒకడు గబగబ ఆమె దగ్గరకు వెళ్ళి "బాబుకేకాదు-వూరికే తెచ్చావు అపఖ్యాతి దొంగ ముండ!" అంటూ ఒక్క లెంప వేశాడు. కిటికీలోంచి చూస్తున్నమూర్తి బుగ్గ తడుముకున్నాడు. కళ్ళు తడిసిపోతున్నాయ్. అంతలో కరణంగారి హుంకరింపు వినిపించింది.

"నిజం చెప్పు-నీవే దొంగలాడావా? లేక నీసరసులెవరైనా దొంగలాడి యిచ్చారా? చెప్పు."

ఆమె మాటాడలేదు. "చెప్పకపోతే పోలీసులకు అప్పు చెప్పిస్తాను-బేడీలేసి ఖైదులో పెట్టిస్తారు!"

ఆమె గాబరాగా కళ్ళెత్తి చూసింది. ఆకళ్ళు తడిసిపోయి వుండటంమూర్తిగమనించాడు. తనకాళ్ళు విరిగినట్లయిపోయాయి.

"ఊఁ చెప్పు" ఘుంకరించాడు కరణం.

"నానే దొంగలాడాను బాబూ" అంతే మరి మాటాడకుండా తలదించింది.

"ఛీ!" అని అరిచాడు కఠినం. మెల్లగా అలా తల దించు కుంటూ కదిలి పోయింది. ఆమె ఒక్కొక్క అడుగు వేస్తుంటే మూర్తి గుండె కంపిస్తోంది. ఒక్కొక్క కన్నీటి బొట్టూ రాల్తోంది, జుత్తు పీక్కుని.

"ఇప్పుడే నేనుఅవినీతి పరుడ్ని-ఆమెను తాకినప్పుడు కాదు!"

ఎవరో వస్తున్నట్లు గమనించి గబగబ కళ్ళు తుడుచుకు న్నాడు. వచ్చింది ఎవరోకాదు, భార్య-చేతిలోవాచీ పట్టుకొని!తొలి సారి ముఖంలో చిరునగవు చిందులు త్రొక్కుతోంది ఉల్లాసంగా.

"ఎంత తమాషా చేశారూ! నన్ను నమ్మించేశారు మీమాటల చాకచక్యంతో! బలేవారు-ఇంతకీ నా తెలివి తక్కువతనాన్ని ఆ మాత్రం తెలుసుకోలేకపోయాను. ఆ బజారు ముండతో మీకేం సంబంధం? అందులో పెళ్ళి సమయంలో! దొంగతనం చేసింది యెవరికోసం ఒప్పుకుంటుంది? మీ పుణ్యం వుంటుంది యిలా నన్నె ప్పుడూ ఆడించకండి."

ఆమె భర్త చేతికి వాచీ తగిలిస్తుండగా మూర్తి వెకిలిగా నవ్వుతూ "మరీ నిన్నెప్పుడూ యిలా ఆడించనులే!" అన్నాడు. ఆ నవ్వు ఆమెకెంతో ఆనందం తృప్తినిచ్చాయి.

ఇంటిలో యింకా అత్తగారు ఆ వాచీ దొంగ మీద శాపనార్థాలు కురిపిస్తోంది. బయట మామగారు ఆమె నీచమైన జీవితాన్ని బహుశః ప్రశ్నించిన పొరుగూరి పెద్ద మనిషితో కామోసు వల్లిస్తు న్నారు. ఇదంతా వింటున్నాడు.... ఆరాటపడి పోతున్నారు.

మూర్తి చీకటి పడేవరకూ తనగది కదల్లేదు. ఆమె గురించి ఆలోచించుకుంటున్నాడు. మట్టిలో పుట్టింది-మట్టిలో పెరుగుతోంది-

తండ్రియెవడో తెలీదు. తల్లి శాశ్వతంగా కళ్ళుమూసింది. వాళ్ళిద్దరికీ పెళ్ళి అవగా ఇది పుట్టలేదు. దీనికి పెళ్ళిలేదు, ఆమె పెళ్ళిలో జరిగే తంతు చూడ్డానికి నోచుకోలేదు—జీవితమే ఒక శూన్యం—కడుపే జీవితం—కడుపే నిత్యశూన్యం—చివరకు ఈ శూన్యం శూన్యంలో కలిసిపోతుంది:

తన పెళ్ళి యెలా వుండాలనుకున్నాడో అలా జరగలేదు. లేనిపోని అట్టహాసం—కోరుకున్న ఆ ప్రశాంతతే లేదు! తన తాతయ్య పెళ్ళిలోనూ ప్రశాంతత లేకపోయుంటుంది. ఆ పొలేరు కూతుర్ని చూసినప్పటి సమయమే ప్రశాంతమైనదేమో! నిజంగా పెళ్ళి అనే అనుభూతి ఆక్షణాన్నే కలిగిందేమో! అలాంటి ప్రశాంతసమయాన్నే తనూ యీ యౌవనిని కలుసుకున్నాడు—అయితే తాతయ్యలా తను చెయ్యలేదు. కాలం మారిపోయింది. తను ఆ పనిచేస్తే లోకం దుమ్మెత్తిపోస్తుంది. తను నేరస్థుడౌతాడు.

మంచి రాత్రివేళ భార్యకు తెలివివచ్చింది. "ఎక్కడికు వెళ్ళా" రంది. "ఇప్పుడే బయటకు" అన్నాడు. ఆమె అతనిని గట్టిగా దగ్గరకు చేర్చుకుంది- అతని సర్వస్వం తనదే అన్నట్లుగా!

తెల్లారుఝామున దొంగగాకూడా పేరు పడిన ఆ జవ్వని కళ్ళు నులుపుకుంటూ పెరటి తలుపు తీసింది. అడుగు ముందుకు వేసేటప్పటికి కాలుకేదో తగిలింది. ఒక్కసారి త్రుళ్ళిపడి చూసేసరికి యేదో తెల్లగా అగపడింది. బుడ్డీ వెలిగించిచూస్తే ఒక తెల్లటి సంచీ లోపలకు తీసుకవెళ్ళివిప్పేసరికి అందులో డబ్బు! ఇంత డబ్బే!.... ఆ డబ్బుతో పాటు చిన్న దారం కట్టిన పసుపుకొమ్ము వుంది. ఆమె ఆ పసుపు కొమ్మును అక్కడపారేసి, ఆడబ్బును కర్రపెట్టిలో దాచుకుంది.

(ఆంధ్రవారపత్రిక 1953)